

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:57 (శనివారం ఉదయం)

అధికారుల సూచనలు పాటిస్తే అధిక లాభాలు
7

# సిరుల వరి.. అగ్గితో ఉరి

నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని చాలా ప్రాంతాలలో సాగునీరు పుష్కలంగా పారుతోంది. దీంతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పెద్దకొత్తపల్లి మండలంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నీటితో కళకళలాడుతున్నాయి. ఆయకట్టు రైతులు వరి సాగుచేయడంతో భూమికి పచ్చని రంగేసినట్లు కనిస్తున్నది. ఎక్కడ చూసినా పచ్చని పైర్లు దర్శనమిస్తున్నాయి. కానీ కొన్ని ప్రాంతాల్లో వరికి తెగులుతో రైతు దిగులు చెందుతున్నాడు. వనపర్తి జిల్లాలోని గోపాల్‌పేట మండలంలో పంటలు తెగుళ్ల బారిన పడి అన్నదాతకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. నారు పోసిన నాటి నుంచి కోత కోసేవరకు చంటిపిల్లలను పెంచినట్లు చూసుకుంటున్నా, తెగుళ్లతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా వరిలో ఎర్ర తెగులు, అగ్గి తెగులు, కంకి తెగులు, సుడి దోమ వేధిస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటి కూడా పైరు ఎండుతోంది.

(కథనాలు 7లో..)

- పెద్దకొత్తపల్లి/గోపాల్‌పేట, ఆంధ్రజ్యోతి



పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మలాపూర్ శివారులో పచ్చగా కళకళలాడుతున్న వరి పంట



గోపాల్‌పేట మండలంలో సాగుచేసిన వరి పంట



దేవునితిర్మలాపూర్ శివారులో అలుగుపారుతున్న కొండమరాజు చెరువు





ఖిల్లాఘణపురం మండలంలోని వెనికి తండాలో ఎండిన వరి పైరును చూపుతున్న గిరిజన రైతులు

## ఎల్‌ఆర్‌ఎస్ వెరీ స్లో..

- అధికారుల చేతివాటంతో ఇదివరకే జీపీ లేఅవుట్‌లకు రిజిస్ట్రేషన్
- అందుకే ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఆదాయం రాని పరిస్థితి
- పెద్దఎత్తున ప్రచారం కల్పిస్తున్నా ఫలితం అంతంతే
- ఉమ్మడి పాలమూరులో జరిగిన రిజిస్ట్రేషన్‌లు 472 మాత్రమే
- రాయితీ గడువు మరో 10 రోజులు మాత్రమే

ఎల్‌ఆర్‌ఎస్(భూ క్రమబద్ధీకరణ పథకం)కు తగినంత స్పందన కరువైంది. "బంపర్ ఆఫర్.. 25 శాతం రాయితీ" అంటూ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల ఏర్పాటుతో పాటు ఆటోలలో మైకులు పెట్టి ప్రచారం చేసినా ఆశించిన ఫలితం కనిపించటం లేదు. ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీని ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీల పరిధిలో ప్రచారం చేస్తున్నారు.. అయినా ఫలితం కనిపించటం లేదు. దరఖాస్తు చేసుకున్న సమయంలో కనిపించిన ఉత్సాహం ఫీజు చెల్లింపునకు వచ్చేసరికి నీరుగారుతోంది. కాగా, నాలుగేళ్లుగా జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్ చేయాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వెంచర్ నిర్వాహకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టిన విషయం విదితమే. ఇందుకు స్పందించిన ప్రభుత్వం వాటికి అవకాశం కల్పిస్తూ 25 శాతం రాయితీ ప్రకటించింది. అయినా ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇప్పటివరకు కేవలం 472 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు మాత్రమే జరగటం గమనార్హం.

- మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

6

### అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌ఆర్‌ఎస్, రిజిస్ట్రేషన్‌లకు ప్రభుత్వం ఇచ్చిన రాయితీ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో ఉన్న మార్కెట్ విలువపై 25 శాతం రాయితీ ఈనెల 31 వరకు ఉన్నం దున అందరూ ఫీజు చెల్లించాలి. ఇప్పుడిప్పుడే కొంత స్పీడ్ పెరిగింది. రీసేల్ చేసుకోవాలంటే ఎల్‌ఆర్‌ఎస్ కచ్చితంగా ఉండాలి. 2020 కన్నా ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్‌కు లింక్ ఉన్నట్లే. వీళ్లకు ఆప్షన్ ఉంటుంది. ఎల్‌ఆర్‌ఎస్ కట్టుకోకున్నా భవన నిర్మాణ సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించాల్సి ఉంటుంది. 2020 తరువాత జరిగిన రిజిస్ట్రేషన్‌లు, అక్రమ రిజిస్ట్రేషన్‌లు ఉంటే వాటికి ఇప్పుడు కచ్చితంగా ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించాలి.

- జిల్లా రిజిస్ట్రార్ రవీందర్



అయిజ మునిసిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

## ఫ్రూట్ కవర్లతో నాణ్యమైన దిగుబడి

- తగ్గిన చీడ పురుగుల బెడద
- జిల్లాలో 33,841 ఎకరాల్లో మామిడి తోటలు
- బాట సింగారం బాట పట్టిన కొల్లాపూర్ రైతులు
- ప్రతీ రోజు దాదాపు 300 టన్నుల తరలింపు
- టన్ను మామిడికి రూ. లక్ష నుంచి రూ.1.50 లక్షలు పలుకుతున్న ధర
- క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద సబ్సిడీ ద్వారా 12 లక్షల ఫ్రూట్ కవర్లు పంపిణీ



కొల్లాపూర్ మామిడి తోటలో కాయలకు ఏర్పాటు చేసిన ఫ్రూట్ కవర్లు

కొల్లాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోనే కొల్లాపూర్ మామిడికి డిమాండ్ ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నాణ్యమైన దిగుబడి వస్తోంది. కొల్లాపూర్ నియోజకవర్గంలో కోటి ఫ్రూట్ కవర్లతో 24వేల 800 ఎకరాల్లో మామిడి పంటను రక్షించుకున్నారు. గత ఏడాది కన్నా నాణ్యమైన దిగుబడి సాధించేందుకు ఫ్రూట్ కవర్లు ఎంతో ఉపయోగపడ్డాయని ఉద్యానవన శాఖ అధికారులు అంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో 33వేల 841 ఎకరాల్లో మామిడి సాగుచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి ప్రతీ రోజు 300 టన్నుల మామిడిని హైదరాబాద్‌లోని బాట సింగారం ఫ్రూట్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. మంచి కాయ సైజు, రంగు ఉన్న టన్ను మామిడి రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అధిక ధర పలుకుతోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది

### నిగనిగలాడుతున్న మామిడి కాయలు

మామిడి కాయలకు కవర్లు తొడగటంతో చీడపీడల బెడద తప్పింది. మసిమంగు, తామర పురుగు, పండు ఈగల నుంచి పంటను కాపాడుకున్నారు. కాయ మంచి సైజు, బంగారు రంగు కలిగి నిగనిగలాడుతూ కనిపించడం ద్వారా మార్కెట్లో మంచి ధర పలుకుతోంది. అకాల వర్షాలు వచ్చినా కాయ రాలకుండా ఈ ఫ్రూట్ కవర్ కాపాడుతోంది. మందులను పిచికారి చేసినా కవర్లు తొడిగిన కాయల మీద పడకపోవడం తో వినియోగదారుల ఆరోగ్యంపై ఎలాంటి దుష్ప్రబావాలు చూపకుండా కాపాడుతోంది.

సీడీపీక్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీలో ఫ్రూట్ కవర్లు అందించారు. జిల్లా వ్యాప్తంగా 12 లక్షల ఫ్రూట్ కవర్లను పంపిణీ చేస్తే అందులో కొల్లాపూర్ నియోజకవర్గంలోనే 11 లక్షల కవర్లు అంద జేశారు. ప్రైవేటులో దాదాపు 80 లక్షల ఫ్రూట్ కవర్లు కొల్లాపూర్ నియోజకవర్గ మామిడి రైతులు కొనుగోలు చేసినట్లు ఉద్యానవనశాఖ అధికారుల ద్వారా తెలిసిం ది. ప్రైవేటులో ఒక్క కవరు ధర రూ2.50 పైసల చొప్పున కొనుగోలు చేశారు.

### మార్కెట్ అందుబాటులో లేక అవస్థలు

మామిడి తోటలకు ప్రసిద్ధిగాంచిన కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వపరంగా మామిడి కొనుగోలు కేంద్రం లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఆరు నెలల పాటు కష్టపడి పండించిన పంటను విక్రయించుకునేందుకు హైదరాబాద్ లాంటి మార్కెట్‌కు పంటను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల ఛార్జీలు, అధిక కమిషన్లు, జీఎస్టీ పేరుతో హైదరాబాద్ ఫ్రూట్ మార్కెట్లో వ్యాపారులు దోపిడీ చేస్తున్నారని, అడిగే వారే లేరని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల కష్టాలు తీరుస్తామన్న పాలకుల హామీ నేటికీ తీరని కలగానే మిగిలిందని వాపోతున్నారు.



కొల్లాపూర్‌లో మామిడి కాయలకు ఏర్పాటు చేసిన కవర్లు



కవర్లు కట్టడంతో మంచి రంగు వచ్చిన మామిడి కాయలు చూపుతున్న రైతు

## ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఇంటి బాట పట్టిన విద్యార్థులు



6

## దొరికిన దొంగలు

- అచ్చంపేట చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- 12 తులాల బంగారం, 4.5 తులాల వెండి స్వాధీనం
- నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

## ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వనపర్తి పట్టణంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

7

## నేటి నుంచి పది పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర గంట ముందే చేరుకోవాలి : డీఈవో

నాగర్‌కర్నూల్ టౌన్/దోమలపెంట/ కల్వకుర్తి/ వనపర్తి రూరల్/ గద్వాల సర్కిల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదో తగరతి వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 60 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిచనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు మొత్తం 10,598 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. అందులో రెగ్యులర్ విద్యార్థులు 10,553 మంది ఉండగా 45 మంది ప్రవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గెర్యులర్ విద్యార్థుల్లో 5,242 మంది బాలురు ఉండగా 5,311 మంది బాలికలు ఉన్నారు. పది పరీక్షల నిర్వాహణకు మొత్తం 590 మంది ఇన్విజిలేటర్లు, 60 మంది సూపరింటెండెంట్లు, 60 మంది డిపార్టుమెంటల్ అధికారులను నియమించారు. అదేవిధంగా మాస్‌కాపీయింగ్‌కు తావు ఇవ్వకుండా జిల్లా వ్యాప్తంగా 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. నేటి నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు నిర్దేశించిన తేదీల్లో పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నిర్మల విద్యాలయంలో ఏర్పాట్లను డీఈవో రమేష్‌కుమార్ పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, పెన్ను, పెన్సిల్ స్కేలుకు మాత్రమే అనుమతి ఉందని తెలిపారు.

వనపర్తి జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 6,853 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 36 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 400 పైగా ఇన్విజిలేటర్లను నియమించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని 40 పరీక్షా కేంద్రాల్లో 7,717 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు 40 మంది సీఎస్, 40 డీవోలు, 40 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, 431 ఇన్విజిటిలేటర్స్, ఇతర అధికారులు విధులు నిర్వహించనున్నారు.



నాగర్‌కర్నూల్ పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న అధికారులు

### పది పరీక్షలు సజావుగా జరగాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

దోమలపెంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సజావుగా సాగేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన ట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ వద్ద ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల పరిసరాలలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ కట్టుదిట్ట మైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

## క్రైం కార్నర్

### అలంపూర్ ఆలయ అర్చకుడిపై చర్యలు

అలంపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని ఐదవ శక్తిపీఠం అయిన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలోని వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలతో రాష్ట్ర ప్రభుత్వం ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మపై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు గురువారం ఈఓ పురేందర్‌కుమార్ కు ఆదేశాలు జారీ చేసింది. కొన్ని రోజుల క్రితం కర్నూలులో సినిమా చూసేందుకు తను వెళ్లిన థియేటర్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఫొటోలను ఆనంద్‌శర్మ తీశాడు. దీంతో పాటు ఆలయం వ్యవహారాల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వానికి అందిన నివేదిక ఆధారంగా అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు ఈఓకు ఆదేశాలు జారీచేశారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నది.

### కారు, లారీ ఢీ

**ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు**



ప్రవీణ్‌గౌడు (ఫైల్)

అలంపూరుచౌరస్తా, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని 44వ జాతీయరహదారిపై గురువారం తెల్లవారుజామున కారు, లారీ ఢీకొని ఒకరు మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. మెడ్చల్ జిల్లా, మేడిపల్లి మండలం, ముత్యాలపల్లి గ్రామానికి చెందిన బుర్రప్రవీణ్‌గౌడు (45) భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నివసిస్తున్నాడు. డ్రైవర్‌గా పని చేస్తున్న ఆయన బుధవారం రాత్రి యజమానులతో కలిసి కడప జిల్లా రాజంపేటకు బయలు దేరాడు. ఉండవల్లి శివారులో వీరి కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నది. ప్రమాదంలో డ్రైవర్ ప్రవీణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న లక్ష్మీనారయణ, మహాలక్ష్మీ, లక్ష్మీనర్సయ్యలు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు.

### ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

లింగాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలంలోని చెన్నంపల్లిలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓర్సు లింగస్వామి (55) భార్య ఏడాది క్రితం మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి ఆయన ఇంట్లో నిద్రపోయాడు. గురువారం ఉదయం అతడి బంధువులు ఇంటికి వెళ్లి చూసేసరికి ఉరి వేసుకుని చేసుకొని ఉన్నాడు. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లింగస్వామికి ఇద్దరు కుమారులున్నారు. అతడి అన్న బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం నల్కర్‌పేట గ్రామానికి చెందిన ఉప్పరి శ్రీనివాసులు (55) ఈ నెల 17న నాగర్‌కర్నూల్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, ముందు వెళ్తున్న కారును ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

**- స్వరాష్ట్రానికి తీసుకెళ్తుండగా యువకుడి మృతి**

జడ్చర్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని సొంత రాష్ట్రానికి తీసుకెళ్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందాడు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నిఖిల్ జైస్వాల్ (19) నవ్‌రత్న అలియాస్ విశ్వకర్మ మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని విజయనగర్‌కాలనీ నివాసం ఉంటున్నారు. ఈ నెల 16న రాత్రి 11:30 గంటల సమయంలో వారిద్దరూ ద్విచక్రవాహనంపై జడ్చర్ల హౌజింగ్‌బోర్డు ప్రాంతంలోని మెడికల్ దుకాణానికి వెళ్లి ట్యాబ్లెట్లు కొనుగోలు చేశారు. ఇంటికి తరిగి వెళ్తుండగా, వేగంగా వచ్చిన గూడ్సు వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో గాయపడిన వారిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నిఖిల్‌ను మెరుగైన చికిత్స కోసం ఉత్తర్‌ప్రదేశ్‌కు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ఆ రాష్ట్రంలోని మహరాజ్‌గంజ్ పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి, నివేదికను పంపిస్తారని సీఐ తెలిపారు. నవ్‌రత్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ వివరించారు.

### దాడి ఘటనపై డీఎస్పీ విచారణ

గద్వాల క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వృద్ధ దంపతులపై దాడి ఘటనపై డీఎస్పీ మొగులయ్య గురువారం విచారణ చేపట్టారు. జోగుళాంబ గద్వాల జిల్లా, చెనుగోనిపల్లికి చెందిన వృద్ధ దంపతులపై ఈనెల 17న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. అదే రోజు స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ మొగులయ్య గురువారం గ్రామానికి చేరుకొని స్థానికులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిని త్వరలోనే గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలోని అన్ని వార్డులను పరిశీలించారు. వృద్ధ దంపతులు కుర్వ రాముడు, కుర్వ సోమేశ్వరమ్మ ఉంటున్న పరిసరాలను పరిశీలించారు. దాడికి కారణాలపై ఆరా తీశారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని స్థానికులకు సూచించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వెంటనే నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరా ఫుటేజీ కీలకమని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు ముందుకు వచ్చినట్లు డీఎస్పీ మొగులయ్య 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

**» రూ. 50 వేల విలువైన వస్తువులు మాయం**

గద్వాల క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం, సుంకులమ్మ మెట్టు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సూపర్‌వైజర్ బాలనర్సమ్మ, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంగన్‌వాడీ టీచర్ కొంత కాలంగా సెలవులో ఉండటంతో, ఆయా ఉమేరాబేగం విధులు నిర్వర్తిస్తోంది. గురువారం ఉదయం ఆమె అంగన్‌వాడీ కేంద్రానికి రాగా, తలుపు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా, 3 బస్తాల బియ్యం, 8 పాల డబ్బాలు, 2 కందిపప్పు ప్యాకెట్లు, 25 ప్యాకెట్ల నూనె, 10 ట్రేల గుడ్లు చోరీకి గురైనట్లు గుర్తించింది. వాటి విలువ రూ. 50 వేలు ఉంటుందని సూపర్‌వైజర్ బాలనర్సమ్మ తెలిపారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఎల్ఆర్ఎస్ వెరీ స్లో..

- » రిజిస్ట్రేషన్ అధికారుల చేతివాటంతో ఇదివరకే జీపీ లేఅవుట్‌లకు రిజిస్ట్రేషన్‌లు
- » అందుకే ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఆదాయం రాని వైనం
- » పెద్దఎత్తున ప్రచారం కల్పిస్తున్నా ఫలితం అంతంతే
- » ఉమ్మడి పాలమూరులో జరిగిన రిజిస్ట్రేషన్‌లు 472 మాత్రమే



మహబూబ్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భూ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) ఆశించిన ఫలితాలనివ్వడం లేదు.. దరఖాస్తులు చేసుకున్న సమయంలో కనిపించిన ఉత్సాహం ఫీజు చెల్లింపులో లేకపోవడంతో అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.. ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీని ప్రకటించింది. 2020 మార్కెట్ విలువ ప్రకారమే వీటికి ఫీజు నిర్ణయించారు. ఇందుకు ఈనెల 31 వరకు అవకాశం ఇచ్చినా దరఖాస్తుదారులు పెద్దగా ముందుకు రాకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు వారి వెంటపడాల్సి వస్తోంది. ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారం కల్పించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీల పరిధిలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. "బంపర్ ఆఫర్.. 25 శాతం రాయితీ" అంటూ ఆటోలలో ఊదరగొడుతున్నా అనుకున్న స్థాయిలో దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులు కానీ, రిజిస్ట్రేషన్‌లు కానీ చేసుకోకపోవడంతో వందకోట్ల వరకు ఆదాయం వస్తుందనుకున్న చోట పదోవంతు ఆదాయం కూడా సమకూరే పరిస్థితి లేదు. దీంతో ఆర్పీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వార్డు ఆఫీసరతో దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎక్కువ మందిచే ఫీజు కట్టించిన వారికి ఇన్సెంటీవ్‌లతో పాటు సర్టిఫికెట్‌లు ఇస్తామని కూడా ప్రలోభాలు పెడుతున్నారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, అడిషినల్ కలెక్టర్‌లు క్రమం తప్పకుండా సదస్సులు ఏర్పాటు చేస్తున్నా, మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేసి దరఖాస్తుదారుల అనుమానాలను నివృత్తి చేసే ప్రయత్నం చేస్తున్నారు. రీసేల్ చేయాలంటే కచ్చితంగా ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని మాడ్యూల్ తీసుకువచ్చారు. అంటే కచ్చితంగా ఎల్ఆర్ఎస్ చేసుకోవాల్సి ఉంటుంది. లింక్ లేని డాక్యుమెంట్‌లకు కచ్చితంగా ఎల్ఆర్ఎస్ చేసుకోవాలి. మరో 10 రోజుల గడువు మాత్రమే ఉండటంతో దరఖాస్తులు ఏమేర వస్తాయో వేచిచూడాలి

#### జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌లలో గోల్‌మాల్

2020 ఆగస్టు నుంచి జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌లను నిలిపివేశారు. నాలుగేళ్లుగా జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్ చేయాలని రియల్ వ్యాపారులు, వెంచర్ నిర్వాహకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అవకాశం ఇస్తే రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటామని, లేదంటే తీవ్రంగా నష్టపోతామని ఆందోళనలు చేశారు. అయితే తాజాగా ప్రభుత్వం వాటికి అవకాశం కల్పిస్తూ 25 శాతం రాయితీ ఇచ్చినా రిజిస్ట్రేషన్‌లకు ముందుకురావడం లేదంటే దీని వెనక ఉన్న మర్మం ఏంటన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ అధికారులు, రియల్టర్‌లు కలిసి అక్రమపద్ధతిలో లొసుగులను అడ్డం పెట్టుకుని రిజిస్ట్రేషన్ చేసి లింక్‌లు ఇచ్చారు. అందుకే వీళ్లంతా ఇప్పుడు ముందుకు రావడం లేదన్న విషయం స్పష్టమవుతోంది. కొందరు కోర్టులకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందుకే ఇప్పుడు ప్రభుత్వం రాయితీ ఇచ్చినా, 2020 మార్కెట్ విలువ ప్రకారం చేస్తామని చెబుతున్నా ముందుకు రావడం లేదంటే ఇదివరకే అన్ని జీపీ లేవుట్లను అధికారులు ఖతం పట్టించారన్న విషయం స్పష్టమవుతోంది. 2021,22,23 సంవత్సరాలలో జీపీ లేవుట్‌లు ఎన్ని రిజిస్ట్రేషన్ చేశారో పరిశీలిస్తే అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి. ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆదాయం వస్తుందని ఆశిస్తున్నా అధికారులు అంతర్గతంగా దాదాపుగా రిజిస్ట్రేషన్‌లు ఇదివరకే చేయడంతో ఇప్పుడు ఖజానాకు ఆదాయం రాని పరిస్థితి నెలకొంది.

#### 472 మాత్రమే..

ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఇప్పటివరకు కేవలం 472 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. 2020లో రూ.1000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులు 1.94 లక్షలు ఉన్నాయి. అదేవిధంగా రూ.10 వేలు చెల్లించిన లేఅవుట్ దరఖాస్తులు కూడా వేలల్లోనే ఉన్నాయి. వీటితోపాటు జీపీ లేఅవుట్‌లో 10 శాతం రిజిస్ట్రేషన్లు జరిగి.. రిజిస్ట్రేషన్ కాని 90 శాతం ప్లాట్లకు కూడా అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండగా ఇందులో మహబూబ్‌నగర్ రిజిస్ట్రేషన్ పరిధిలో 36, జడ్చర్లలో 44, వనపర్తిలో 111, ఆత్మకూర్‌లో 16, గద్వాలలో 64, అలంపూర్‌లో 16, నారాయణపేటలో 24, మక్తల్‌లో 4, నాగర్‌కర్నూల్‌లో 24, అచ్చంపేటలో 03, కల్వకుర్తిలో 95, కొల్లాపూర్‌లో 26 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అదేవిధంగా మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో 31 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు గాను బుధవారం నాటికి కేవలం 1200, జడ్చర్ల పురపాలికలో 225, భూత్పూర్‌లో 170 దరఖాస్తుల ఫీజులు మాత్రమే చెలల్లించారు. వీటిద్వారా మొత్తంగా రూ.10-12 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరినట్లు తెలుస్తోంది.

#### హెల్ప్‌డెస్క్‌లు, ఆన్‌లైన్ యాప్‌లు:

దరఖాస్తుదారులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు పురపాలిక, కార్పొరేషన్ పరిధిలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. నేరుగా ఉన్నతాధికారులు, స్పెషల్ ఆఫీసర్లే వీటిని పర్యవేక్షిస్తున్నారు. దరఖాస్తుదారులు ఫీజు ఎలా చెల్లించాలి? ఎంత చెల్లించాలి? ఏమేమి పత్రాలు తీసుకురావాలి వంటి విషయాలను హెల్ప్‌డెస్క్‌లో వివరించనున్నారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌కు ప్రతిరోజు పెద్దసంఖ్యలో దరఖాస్తు దారులు వచ్చి సందేహాలు అడిగి వెళుతున్నా అదే స్థాయిలో ఫీజులు మాత్రం చెల్లించడం లేదు. ఇక సెల్‌ఫోన్ ద్వారానే నేరుగా ఫీజు చెల్లింపులకు కూడా ఆన్‌లైన్‌యాప్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ. రిజిస్ట్రేషన్.జివోవి.ఇన్ అని టూప్ చేస్తే ప్రీ రిజిస్ట్రేషన్ ఎల్ఆర్ఎస్ 2020 అని వస్తుంది. అది క్లిక్ చేసి అక్కడ సిటిజన్ లాగిన్‌ను ఎంచుకుని ఎల్ఆర్ఎస్ దరఖాస్తు సమయంలో ఇచ్చిన ఫోన్‌నెంబర్ కొడితే ఓటీపీ వస్తుంది. ఓటీపీని నమోదుచేస్తే వివరాలు వస్తాయి. దాని ప్రకారం ఫీజు చెల్లింపులు చేసుకోవచ్చు.




ఎల్ఆర్ఎస్‌పై అవగాహనకు ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు




కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

# దొరికిన దొంగలు

- » అచ్చంపేట చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- » 12 తులాల బంగారం, 4.5 తులాల వెండి స్వాధీనం
- » నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

అచ్చంపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలో గత నెల 16న జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. కేసు వివరాలను పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు.

అచ్చంపేటకు చెందిన అశ్విని, పెంట్లవెల్లి మండలానికి చెందిన చాపల శ్రావణి స్నేహితులు. పట్టణంలో టైలరింగ్ పని చేసే అశ్విని వద్దకు వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయురాలు దుస్తులు కుట్టించుకునేందుకు తరుచూ వచ్చేది. ఈ క్రమంలో ఆమె స్థితిగతులను తెలుసుకున్న అశ్విని స్నేహితురాలైన శ్రావణితో కలిసి చోరీకి పథకం రూపొందించింది. ముందుగా ఆన్‌లైన్‌లో బురఖాలు కొనుగోలు చేశారు. ఇద్దరూ వాటిని ధరించి ఇల్లు అద్దెకు కావాలంటూ ఉపాధ్యాయురాలి ఇంటికి వెళ్లారు. ఆమెను కత్తితో బెదిరించి 12 తులాల బంగారం, 4.5 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించి దొంగలను గుర్తించారు. ముందుగా పట్టణంలోని అశ్వినిని అరెస్ట్ చేసి విచారించారు. ఆమె ఇచ్చిన సమాచారంతో శ్రావణిని కూడా అరెస్ట్ చేశారు. సీఐ రవీందర్, ఎస్ఐలు రమేశ్, ఇందిర కలిసి చాకచక్యంగా దొంగలను పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా 24 కేసులను ఛేదించామని చెప్పారు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇళ్లు, వ్యాపార సముదాయాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని, పోలీసులకు సహకరించాలన్నారు.

జిల్లాలో ప్రతీ గ్రామానికి పోలీసు పెట్రోలింగ్ వాహనం తిరుగుతోందన్నారు.

## భార్యను చంపిన భర్త

**- ఇష్టం లేని పెళ్లి చేశారని ఘాతుకం.. రెడ్యానాయక్ తండాలో ఘటన**



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మరికల్ సిఐ



హత్యకు గురైన శారురాథోడ్

నారాయణపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇష్టం లేని పెళ్లి చేశారని ఓ వ్యక్తి భార్యను గొంతు నులిమి చంపేశాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట మండలం, డ్రైవర్ గోపి తండాకు చెందిన రాథోడ్ లోక్యానాయక్ తన కుమార్తె శారు రాథోడ్ (20)కు, తన అక్క కొడుకు, రేడ్యానాయక్ తండాకు చెందిన వినోద్‌నాయక్‌తో ఈ ఏడాది జనవరి 21న వివాహం జరిపించారు. కానీ తనకు ఇష్టం లేని పెళ్లి చేశారంటూ వినోద్‌నాయక్ తరుచూ భార్య శారుతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం 6:30 గంటల సమయంలో రెడ్యానాయక్ తండాకు చెందిన వెంక్యానాయక్ అనే వ్యక్తి లోక్యానాయక్‌కు ఫోన్ చేసి, మీ కుమార్తె చనిపోయిందని చెప్పాడు. దీంతో అతడు కుటుంబసభ్యులతో కలిసి రెడ్యానాయక్ తండాకు చేరుకున్నాడు. శారు రాథోడ్ మృతదేహాన్ని పరిశీలించగా, గొంతుకు గాయాలున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మరికల్ ఇన్‌చార్జి సీఐ రాజేందర్‌రెడ్డి, పేట ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. శారు రాథోడ్ మృతదేహాన్ని నారాయణపేట ఆసుపత్రికి తరలించారు. తండ్రి రాథోడ్ లోక్యానాయక్ ఫిర్యాదు మేరకు వినోద్‌నాయక్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ముగిసిన ఇంటర్ పరీక్షలు





పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



సామగ్రితో పాటు బస్టాండ్‌కు వెళ్తున్న విద్యార్థులు

**- ఇంటి బాట పట్టిన విద్యార్థులు**

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ గద్వాల సర్కిల్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం గురువారం ముగిశాయి. ఈ నెల ఆరు నుంచి ప్రారంభమైన పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. చివరి రోజు గురువారం రసాయనశాస్త్రం, కామర్స్ పేపర్-2 పరీక్షలు నిర్వహించారు. పరీక్ష ముగిసిన అనంతరం కేంద్రాల నుంచి బయటకు విద్యార్థులు ఒకరికొకరు బైబై చెప్పుకుంటూ ఇంటి బాటపట్టారు. ప్రైవేట్, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు పెట్టెలు, పుస్తకాలు సర్దుకొని తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల వెంట సొంత ఊర్లకు బయలు దేరారు. దీంతో జిల్లా కేంద్రాల్లోని బస్టాండ్లు విద్యార్థులతో కిక్కిరిశాయి.

- మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 36 కేంద్రాల్లో గురువారం నిర్వహించిన పరీక్షకు 9,777 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా, 9,517 మంది హాజరయ్యారు. 260 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 8,343 మందికి గాను, 8,141 మంది పరీక్ష రాశారు. 202 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ విభాగంలో 1,434 మందికి గాను, 1,376 మంది హాజరు కాగా, మరో 58 మంది పరీక్ష రాయలేదు.
- జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 3,577 మంది విద్యార్థులకు గాను, 3,458 (97 శాతం) మంది హాజరయ్యారు. వారిలో జనరల్ విభాగంలో 2,929 మందికి గాను, 2,837 (97 శాతం) మంది పరీక్ష రాశారు. వృత్తి విద్య విభాగంలో 648 మందికి గాను 623 (96 శాతం) మంది హాజరయ్యారు. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, వాగ్దేవి, జ్ఞానప్రభ, కొట్టం మాణిక్యమ్మ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు తనిఖీ చేశారు.
- నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 పరీక్ష కేంద్రాల్లో 3,803 మంది విద్యార్థులకు గాను 3,724 మంది పరీక్షలు రాశారు. 79 గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3,335 మందికి గాను, 3,277మంది హాజరు కాగా, 58 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 468 మందికి గాను, 447 మంది పరీక్ష రాశారు. 21 మంది హాజరు కాలేదు. నారాయణపేట, ఊట్కూర్‌లలోని పరీక్షా కేంద్రాలను జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్‌రావు తనిఖీ చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,996 మంది విద్యార్థులకు 5,789 మంది హాజరయ్యారు. 207 మంది గైర్హాజరయ్యారు. వారిలో రెగ్యులర్ విద్యార్థులు 4,842 మందికి గాను, 4,674 మంది పరీక్ష రాశారు. 168 మంది హాజరు కాలేదు. ఒకేషనల్‌లో 1,154 మందికి గాను, 1,115 మంది హాజరు కాగా, 39 మంది పరీక్ష రాయలేదు. జిల్లా కేంద్రంలోని రవితేజ, శ్రీనివాస పద్మావతి, మైనార్టీ గురుకులం, ఎంజేపీ బీసీ గురుకులం పరీక్ష కేంద్రాలను ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ తనిఖీ చేశారు.
- వనపర్తి జిల్లాలో 5,763 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 5,613 మంది పరీక్ష రాశారు. మరో 150 మంది విద్యార్థులు గుర్హాజరయ్యారు. జనరల్‌లో 4,925 మందికి గాను, 4,818 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 107 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 838 మందికి గాను, 795 మంది విద్యార్థులు హాజరయ్యారు. 43 మంది పరీక్ష రాయలేదు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో అంజయ్య తనిఖీ చేశారు.

## ధాన్యం డబ్బు కోసం రైతుల ఆందోళన

**- పోలీస్ స్టేషన్ ఎదుట**

**మహిళా రైతు ఆత్మహత్యాయత్నం**

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారి డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు గురువారం ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోదల్ గ్రామానికి చెందిన రైతుల వద్ద నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న వ్యాపారి మంచాల శ్రీనివాసులు మూడు నెలల క్రితం ధాన్యం కొనుగోలు చేశాడు. కానీ డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండటంతో అతడి ఇంటి వద్ద గొడవకు దిగారు. అయినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసుస్టేషన్‌కు వెళ్లి విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఓ మహిళా రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## అంబులెన్స్ దగ్ధం

**- పాలెం పీహెచ్‌సీలో ఘటన**

బిజినేపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 20 : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిలిపి ఉంచిన ఆలన అంబులెన్స్ దగ్ధమైంది. బుధవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో వృద్ధులకు సేవలు అందించాల్సిన ఆలన అంబులెన్సు కొంత కాలంగా నిరుపయోగంగా ఉంది. ఆసుపత్రి ఆవరణలో నిలిపి ఉంచిన అంబులెన్సుకు బుధవారం రాత్రి మంటలు అంటుకున్నాయి.

చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో, వారొచ్చి మంటలను ఆర్పి వేశారు. డీఎంహెచ్‌వో కేవీ స్వరాజ్య లక్ష్మీ గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



దేవునితిర్మలాపూర్ శివారులో కళకళలాడుతున్న వరి పైరు

# సిరుల వరి..

- ఎంజీకేఎల్ఐ నీటితో పెరిగిన వరి సాగు

- నిండిన చెరువులు, కుంటలు - ఆనందంలో అన్నదాతలు

పెద్దకొత్తపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటి రాకతో నాగర్‌కర్నూల్ జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఒక వైపు కాల్వల ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. మరో వైపు భూగర్భజలాలు పెరగడంతో బోర్లు, బావుల్లో సమృద్ధిగా నీరు లభిస్తోంది. పెద్దకొత్తపల్లి మండలంలోని దేవుని తిర్మలాపూర్, వెన్నచెర్ల, జొన్నలబొగుడ, బాచారం, సాతాపూర్, నారాయణపల్లి, గంట్రావుపల్లి, కొత్తపేట, మహాసముద్రం, కల్వకోల్ తదితర గ్రామాల్లో చెరువులు, కుంటలు నీటిలో నిండి కళకళలాడుతున్నాయి. ఎక్కడ చూసినా పచ్చని పైర్లు దర్శనమిస్తున్నాయి. మండల రైతులు ఈ ఏడాది యాసంగిలో 8,144 ఎకరాల్లో వరి, 2,511 ఎకరాలల్లో మొక్కజొన్న, 4,988 ఎకరాల్లో మినుములు, 5,968 ఎకరాలలో వేరుశనగ, 66 ఎకరాలల్లో జొన్న సాగు చేశారు. మరో 150 ఎకరాల్లో కూరగాయల పంటలున్నాయి.

### భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

గతంలో బోర్లు బావులు ఉన్న రైతులు మాత్రమే విద్యుత్‌ను వినియోగించేవారు. కానీ ఎంజీకేఎల్ఐ నీటి రాకతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రైతులు కాల్వలో మోటార్లను అమర్చుకొని పంటలకు నీరు పారించుకుంటున్నారు. బోర్లు, బావుల కింద కూడా సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో గతం కంటే రెండు రెట్ల విద్యుత్ వినియోగం పెరిగినట్లు అధికారులు చెప్తున్నారు. అయితే రైతులు విద్యుత్ వినియోగానికి తగిన అనుమతులు తీసుకోవాలని సూచించారు.



పెద్దకొత్తపల్లి సమీపంలో కాల్వల ద్వారా నిండుగా ప్రవహిస్తున్న నీరు

### మా తలరాతలు మారాయి



ఎంజీకేఎల్ఐ నీటి రాకతో మా తలరాతలు మారాయి. భూమి ఉన్నా నీళ్ల లేక పంటలు సాగు చేయలేకపోయాం. దీంతో మా భూములు బీడుగా ఉండేవి. ప్రస్తుతం కాల్వల ద్వారా ఎంజీకేఎల్ఐ నీరు రావడంతో పంటలు పండించుకుంటున్నాం. జీవనా. ధారం దొరికింది.

బొల్లె పెద్ద నిరంజన్, రైతు, దేవునితిర్మలాపూర్

### పెరిగిన వరి సాగు



ఎంజీకేఎల్ఐ నీటి రాకతో యాసంగిలో వరి సాగు అధికంగా పెరిగింది. రైతులు ఉత్సాహంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఇతర పంటల కన్నా ఎక్కువగా వరి పంట పెరిగింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం తోనూ రైతులకు ఎంతో మేలు జరుగుతోంది.

శిరీష, మండల వ్యవసాయ అధికారి, పెద్దకొత్తపల్లి



కోయిలకొండలో అగ్ని తెగులు సోకిన వరి పంట



కోయిలకొండ మండలంలో ఎండిపోయిన పెద్దవాగు

# అగ్గితో ఉరి

- తెగులుతో దెబ్బతింటున్న వరి పైర్లు
- ఆశిస్తున్న కాండం తొలుచు పురుగు
- బోర్లు, బావుల్లో అడుగంటుతున్న నీరు
- సాగునీరు అందక ఎండుతున్న పంటలు
- యాసంగి సాగుకు అష్టకష్టాలు

కోయిలకొండ/ గోపాల్‌పేట/ నారాయణపేట మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం, వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో యాసంగిలో సాగు చేసిన వరి పైర్లను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఒక వైపు ఎండలు తీవ్రం కావడంతో బోరుబావుల్లో నీరు అడుగంటుతోంది. మరో వైపు తెగుళ్ల బెడదతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురడంతో కోయిలకొండ మండలంలోని చెరువులు, పెద్దవాగు, చిన్నవాగులు పొంగి పొరలాయి. దీంతో వానాకాలం ఆశించిన మేర పంట దిగుబడి వచ్చింది. అదే ఉత్సాహంతో రైతులు యాసంగిలోనూ అధికంగా వరి సాగు చేశారు. మండల రైతులు కోయిల్‌సాగర్ బ్యాక్ వాటర్‌తో పాటు, చెరువులు, బోరు బావుల కింద గత ఏడాది యాసంగిలో 8 వేల ఏకరాల్లో వరి సాగు చేయగా, ఈ ఏడాది 11 వేల ఎకరాల్లో సాగు చేశారు. నాట్లు వేసే ముందు నీరు సమృద్ధిగా ఉన్నా, ఆ తర్వాత బోరుబావులు అడుగంటడం సమస్యగా మారింది. దీంతో దాదాపు 300 ఎకరాల్లో వరి పైర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ఇప్పటికే మండలంలో 200 ఎకరాలకు పైగా వరి పైర్లను రైతులు పశువుల మేతకు వదిలేశారు.

వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. వరి పంటకు ఎర్ర తెగులు



జిల్లాలో బోరు నీరు తగ్గి సన్నగా వస్తున్న నీరు

కంకి తెగుళ్ల సోకడంతో పాటు, సుడి దోమ ఆశిస్తోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు చెప్తున్నారు.

### కొత్త బోర్లు వేయిస్తున్న రైతులు

వరి పైర్లను కాపాడుకునేందుకు రైతులు కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. ఒక్కో రైతు 2, 3 బోర్లు వేయించినా నీరు పడక లక్షల రూపాయలు నష్టపోతున్నారు. ఇటీవలి కాలంలో మోటర్లు, పైపుల కొనుగోలు కూడా పెరిగింది. కోయిలకొండ మండలంలో ప్రధానమైన పెద్ద వాగులోని కోయిల్‌సాగర్ బ్యాక్ వాటర్ గత సంవత్సరం కంటే ఈ ఏడాది ముందే ఇంకి పోయింది. దీంతో బోరుబావుల్లో నీరు అడుగంటిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు వరికి సోకిన అగ్గితెగులు, ఆశించిన కాండం తొలుచు పురుగు నివారణకు ఎన్ని మందులు కొట్టినా ఫలితం ఉండటం లేదని చెప్తున్నారు. వరి పైర్లకు మోతాదుకు మించి యూరియా వాడడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. మండలంలో పంటల సాగుకు అత్యధికంగా 800 మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగించినట్లు వెల్లడించారు.

### బోరుబావుల్లో నీరు తగ్గింది



ఈ సంవత్సరం కాలం మంచిగా అయినా, ఎండల తీవ్రతతో బోరుబావుల్లో నీరు పూర్తిగా అడుగం టింది. వరి పంటకు నీరు అందడం లేదు. నాట్లు వేసే ముందు నీరు బాగానే ఉన్నా, కలుపు తీసిన తరువాత సాగు నీరు అందక ఎండిపోయే స్థితి ఏర్పడింది. దీంతో పంటను కాపాడుకొనేందుకు కష్టాలు తప్పడం లేదు.

- లక్ష్మయ్య రైతు కోయిలకొండ

### మందు పిచికారి చేశాను



నేను మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. ఈ సమ యంలో ఎర్ర తెగులు సోకడంతో దెబ్బతింటోంది. దీంతో గింజ నట్టలుగా మారడంతో దిగుబడి తగ్గుతుంది. తెగులు నివారణకు అధికారుల సూచన మేరకు మందు పిచికారి చేశాను.

- అయోధ్య రాములు, రైతు, లక్ష్మీదేవిపల్లి

### అగ్గి తెగులుతో ఇక్కట్లు



యాసంగిలో సాగు చేసిన వరి పైర్లకు అగ్గి తెగులు సోకింది. నివారణకు ఎన్ని మందులు కొట్టినా ఫలితం ఉండటం లేదు. నీరు ఉన్నా తెగులుతో పంట పెరగడం లేదు. గత సంవత్సరం కంటే ఈ సారి పంట దిగుబడి తక్కువే వస్తుంది.

- మాధవరెడ్డి, రైతు, కోతలాబాద్

### నారాయణపేట జిల్లాలో..

నారాయణపేట జిల్లాలో యాసంగిలో సాగు చేసిన వరి, వేరుశనగ పంటలు ఎండిపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.27 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. జిల్లాలో 70 వేల వరకు బోర్లు ఉండగా, భూగర్భ జలం తగ్గడంతో అవి అడుగంటుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి బోర్ల కింద సాగు చేసిన వరి పైర్లు నీరందక ఎండిపోతున్నాయి. దీనికి తోడు విద్యుత్ కష్టాలు కూడా వెంటాడుతున్నాయి. నారాయణపేట మండలం, భైరంకొండలో రైతు రామప్ప పొలం దగ్గర ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఎనిమిది రోజులవుతున్నా మరమ్మతు చేయలేదు. దీంతో సాగునీరు పారించే పరిస్థితి లేక బోర్ల కింద వేసిన వరి, వేరుశనగ పంటలు ఎండిపోతున్నాయి.



భైరంకొండలో ఎండుతున్న వరి పైరు



భైరంకొండలో వాడుతున్న వేరుశనగ పంట

### అవగాహన కల్పించాం..



అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించాం. కొందరు రైతులు యూరియాను అధికంగా వాడడం వల్లే ఇబ్బందులు తలెత్తాయి. మండలంలో వరి సాగు, తెగుల్లు తదితర వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందించాం.

- యామారెడ్డి వ్యవసాయ అధికారి, కోయిలకొండ

### సూచనలు పాటించాలి



గోపాల్‌పేట మండలంలో వరి పంటకు ఎర్ర తెగులు సోకుతోంది. ఈ తెగులుతో పైరు ఎర్రగా మారి, కాడం కింది నుంచి ఎండిపోతుంది. రైతులు ముందుగా గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకుంటే తెగులును నివారించవచ్చు. తెగులును గుర్తించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి, సూచనలు, సలహాలను పాటించాలి.

- కరుణ శ్రీ, మండల వ్యవసాయ అధికారి, గోపాల్‌పేట

## స్పోర్ట్స్ బాక్స్

### జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానుయేలు

గద్వాల అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వీరేశ్, లక్ష్మి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియేలు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మంచి ఆటతీరుతో జట్టు విజయానికి దోహదపడాలని సూచించారు. ఫిజికల్ డైరెక్టర్ హైమావతి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో వీరేశ్, గణేశ్, బాలికల విభాగంలో లక్ష్మి, నందిని, తేజశ్రీ పాల్గొన్నారని తెలిపారు. వారిలో వీరేశ్, లక్ష్మి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బీసన్న, ఉపాధ్యాయులు రేణుకాదేవి, అన్నయ్య పాల్గొన్నారు.

### సూపర్ సిస్టర్స్

- ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు అక్కాచెల్లెళ్లు



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లు

మక్తల్‌రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్‌కు చెందిన అక్కా చెల్లెళ్ల ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన విశ్రాంత పీఈటీ బి.గోపాలం కుమార్తెలు బి.రూప, బి.పుష్ప (వ్యాయామ ఉపాధ్యాయురాలు), బి.దీప (ఉపాధ్యాయురాలు), బి.శిల్ప (పశు సంవర్ధక శాఖ)లో ఉద్యోగాలు చేస్తున్నారు. హైదరాబాద్ జింఖానా మైదానంలో గత జనవరి 23, 24తేదీల్లో జరిగిన సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 24 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు. వీరి ఎంపికపై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- మన ఆరోగ్యం మన చేతుల్లోనే...
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతిభద్రతల కోసం ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బంది 24 గంటలు పని చేస్తుంటారని, వీరంతా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వనపర్తిలో 500 పడకల ఆసుపత్రి, పెబ్బేరు లో 30 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసులు విధులు నిర్వహించడంతో పాటు తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా 40 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ... విధి నిర్వహణలో ఉండడం వలన చాలా మంది పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యాన్ని పట్టించుకోరని, మీరు ఆరోగ్యంగా ఉంటేనే మీ కుటుంబం సంతోషంగా ఉంటుందని తెలిపారు. వైద్య శిబిరంలో 750 మంది పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఇన్‌చార్జి అదనపు ఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అపర్ణ, డీఎస్పీ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి శ్రీనివాసులు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సైన్స్ సదస్సుకు 'పేట' విద్యార్థి

- జపాన్ సుకుర సైన్స్ ప్రోగ్రాంలో పాల్గొననున్న శివారెడ్డి
- అభినందించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



విద్యార్థి శివారెడ్డి,ఉపాధ్యాయులు జరినాను సన్మానించిన కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల, డీఈవో గోవిందరాజులు

నారాయణపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జపాన్ దేశంలో నిర్వహించనున్న సుకురా అంతర్జాతీయ సైన్స్ సదస్సుకు నారాయణపేట జిల్లా విద్యార్థి శివారెడ్డి ఎంపికయ్యాడు. 11వ జాతీయ స్థాయి మానాక్ ఇన్‌స్పైర్ అవార్డు పోటీలకు రాష్ట్రం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో శివారెడ్డి ఉండటం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ సిక్తాపాట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జపాన్ ప్రభుత్వం జూన్ 15 నుంచి జూన్ 21 వరకు సుకుర అంతర్జాతీయ సైన్స్ సదస్సుకు భారతదేశం నుంచి 54 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా ప్లాస్టిక్‌కు బదులుగా కొబ్బరి పీచుతో పూల కుండీలు తయారు చేసిన శివారెడ్డి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి శివారెడ్డి, గైడ్ టీచర్ జరీనా, ప్రిన్సిపాల్ శ్రీనివాసులులను కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల సన్మానించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డా.గోవిందరాజులు, సైన్స్ అధికారి భాను ప్రకాష్ అభినందనలు తెలిపారు.

## అధికారుల సూచనలు పాటిస్తే అధిక లాభాలు

- ఆయిల్ పామ్ శాస్త్రవేత్త డాక్టర్ బీఎన్ రావు



తాడూరు మండలం, మేడిపూర్‌లోని ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్.రావు, రైతులు

తాడూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే ఆయిల్ పామ్‌లో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుందని ఆయిల్ పామ్ శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్.రావు అన్నారు. ఆయిల్ పామ్ సాగుచేస్తున్న జిల్లా రైతులకు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని మేడిపూర్‌లో మల్లెపల్లి వెంకట్‌రెడ్డి తోటలో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. ఆయిల్‌ఫామ్ తోటల్లో నీటి తడులు, ఎరువుల వినియోగంపై సూచనలు చేశారు. సమృద్ధిగా నీటి వసతి ఉన్న రైతులు అధిక ఆదాయం వచ్చే ఆయిల్ పామ్ తోటలు సాగు చేయాలని చెప్పారు. మొదటి మూడు సంవత్సరాల వరకు అంతర పంటలుగా కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేయవచ్చునని తెలిపారు. 2020-21 సంవత్సరంలో పైలట్ ప్రాజెక్టు కింద సాగు చేసిన తోటల దిగుబడులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కన్న జగన్, ఫ్రీయూనిక్ కంపెనీ డీజీఎం మల్లేశ్వర్‌రావు, ఉద్యానవన అధికారులు మహేశ్వరి, స్రవంతి, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

## ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు

- తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా సాగునీరు
- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్



తుమ్మిళ్లలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్

రాజోలి, మార్చి 20 : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. రాజోళి మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామ సమీపంలో మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎండీసీ) గుర్తించిన ఇసుక డీ-సిల్టేషన్ ప్రదేశాన్ని పరిశీలించారు. ఇసుక తవ్వకాల ప్రక్రియ, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను సంబంధిత అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇసుక తవ్వకాలు పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు చేపట్టే నిర్మాణాలకు, ప్రభుత్వ ప్రాజెక్టులకు అవసరమైన ఇసుకను సమర్థవంతంగా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. అందుకు నీటి పారుదల, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అనంతరం తుమ్మిళ్ల లిఫ్టును తనిఖీ చేసి, పనితీరును పరిశీలించారు. నీటి నిల్వ, ఇండెంట్ చేసిన నీటి సరఫరా, సాగు, తాగు నీటి అవసరాలు, వినియోగం, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యల వివరాలను తెలుసుకున్నారు. లిఫ్టు ద్వారా నీటి సరఫరాను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మైనింగ్ ఏడీ వెంకట రమణ, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, తహసీల్దార్ రామ్మోహన్ ఉన్నారు.

**ఇంటర్వ్యూ..**

## వేసవిలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

**- మురళీ, నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్**



నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో మునిసిపాలిటీలోని మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి అన్నారు. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నందున మునిసిపాలిటీ పరిధిలోని పార్కులు, ప్రభుత్వ స్థలాలు, అవెన్యూ ప్లాంటేషన్, డివైడర్ మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

**మునిసిపాలిటీ పరిధిలో మొక్కలు పెంచుతున్నారా?**

నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలో విలీన గ్రామాలతో కలిపి మొత్తం 24 వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో కేసరిస ముద్రం మినీ ట్యాంక్‌బండ్, గాంధీ పార్కు, రోడ్డుకు ఇరువైపులా అవెన్యూప్లాంటేషన్, డివైడర్ మధ్యలో మొక్కలను నాటి పెంచుతు న్నాం.

**వేసవిలో మొక్కల సంరక్షణ ఎలా ఉంది?**

వేసవిలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కేసరిసముద్రం మినీ ట్యాంక్‌బండ్ వద్ద నాటిన మొక్కలను అక్కడే ఏర్పాటు చేసిన బోరు మోటార్లతో నీటిని అందించి సంరక్షిస్తున్నాం. అలాగే మునిసిపాలిటీ పరిధిలోని అవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు డివైడర్ మధ్యలో ఉన్న మొక్కల సంరక్షణకు రెండు ట్యాంకర్లను ఉయోగించి నిత్యం నీటిని అందిస్తున్నాం. అందుకు నలుగురు సిబ్బందని ప్రత్యేకంగా నియమించాం.

**మొక్కల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఉందా?**

వేసవిలో పచ్చదనం తగ్గకుండా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. కాలనీల్లో నాటిన మొక్కలను ఎండిపోకుండా సమీప ఇంటి యాజమానులతో మాట్లాడి నీరు పోసి రక్షించేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రజల సహకారం అవసరం.

**న్యూస్ బాక్స్**

### లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ ఈవో, పాలకమండలి సభ్యులు

ఉప్పునుంతల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. పాతహుండీ రూ. 45,765, కొత్త హుండీ రూ. 65,054 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, పాలక మండల సభ్యులు గణేష్‌గౌడ్, ఎలుక స్వరూపానుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రదీప్, ప్రసాద్, ఆలయ క్లర్క్ నాగరాజు, బాల్‌రావు ఉన్నారు.

### ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

వెల్దండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాన్‌గాట్‌తండాలో నిర్మించే వేంకటేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠకు పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు గురువారం నిర్వాహకులకు రూ.లక్షా 10వేల విరాళం అందజేశారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని పేర్కొన్నారు.

### పెద్దకొత్తపల్లి పంచాయతీ తైబజార్ వేలంపాట

పెద్దకొత్తపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గురువారం పెద్దకొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో 2025-26 సంవత్సరానికి గాను తైబజార్ వేలం పాట నిర్వహించారు. ఒక ఏడాదికి గాను రూ.10.41లక్షల ఆదాయం సమకూరింది. పెద్దకొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తైబజార్‌లో గొర్రెలు, మేకల సంత రెండు షెటర్లకు వేలం పాట మండల పంచాయతీ అధికారి లింగయ్య, పంచాయతీ కార్యదర్శి నాగశేషిల ఆధ్వర్యంలో సజావుగా నిర్వహించారు. ఇందులో గొర్రెలు, మేకల సంతను వేలం పాటలో గడ్డిగోపుల ఎల్లయ్య రూ.2లక్షల 60 వేలకు వేలంలో దక్కించుకున్నారు. అలాగే రెండు షెటర్లకు గాను మిద్దె రాధాకృష్ణ, గడ్డిగోపుల వపన్ ఒక్కొక్క షెటర్‌కు నెల అద్దె రూ. 7500 చొప్పున రెండు షెటర్లను వేలం పాటలో కైవసం చేసుకున్నారు. అలాగే కూరగాయల సంతకు నిర్వహించిన వేలం పాటలో కూర రాముడు 6.1లక్షల రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు.

### 'యోధుల వర్ధంతిని అధికారికంగా ప్రకటించాలి'

పెద్దకొత్తపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి గోడ పత్రికలను గురువారం పెద్దకొత్తపల్లిలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. క్రీడోత్సవాలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు బి.సురేష్, కే.శేఖర్, పి.అంజి, టి.శివకుమార్, జి.కుర్మయ్య, బి.శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



చారకొండలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీత

చారకొండ/ తెలకపల్లి/ వెల్దండ/ బల్మూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం పలు మండలాల్లో అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించి, అక్కడ ఏర్పాట్లు, వసతులపై పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీటి వసతి, వైద్యసదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనప్పటికీ పరీక్షకు అనుమతిస్తాని, అయినా ప్రతీ విద్యార్థి అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పరిసరాలలో ఉన్న జిరాక్స్ కేంద్రాలు పరీక్ష జరుగుతున్న సమయంలో మూసి ఉంచాలని పేర్కొన్నారు.

●చారకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో ఝాన్సీరాణి, ఎస్ఐ శంషుద్దీన్‌తో కలిసి తహసీల్దార్ అద్దంకి సునీత పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ మండంలోని చారకొండ జడ్పీహెచ్‌ఎస్‌లో 87, జూపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 22, కేజీబీవీలో 37, విశ్వాశాంతి హైస్కూల్‌లో 31, మొత్తం 177 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. చీఫ్ సూపరిండెంట్ శ్రీనివా సులు, డిపార్ట్ మెంటల్ అధికారి మురళీధర్‌రెడ్డితో పాటు 9మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబ స్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● తెలకపల్లి మండలంలో జడ్పీహెచ్‌ఎస్ గౌరెడ్డిపల్లి, జడ్పీహెచ్‌ఎస్ తెలకపల్లి, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ తెలకపల్లి, కేకే.రెడ్డి తెలకపల్లి ఇలా నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ నాలుగు కేంద్రాల్లో మొత్తం 873 పరీక్ష రాస్తారని తెలిపారు. వెల్దండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో చంద్రుడు తెలిపారు. ఈరెండు కేంద్రాలలో 354 మంది పరీక్ష రాస్తారని తెలిపారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపరిండెంట్ అధికారులుగా రవీందర్, బాలీశ్వర్, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా రవికిరణ్, శ్రావన్‌కుమార్‌లతోపాటు మరో 18 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించినట్లు తెలిపారు.

● బల్మూరు మండలంలో బల్మూరు ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలోని కేంద్రాల్లో 286 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఎంఈవో విష్ణుమూర్తి తెలిపారు.

## చరిత్రాత్మక నిర్ణయంపై హర్షం

**- బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై సంతోషం**

**- రాహుల్‌గాంధీ, సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం**



సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఊర్కొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచడం, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఊర్కొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో బీసీ వర్గాల రిజర్వేషన్లు పెంపొందించడంతో పాటు ఎస్సీ వర్గీకరణకు ఏకకాలంలో శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని జగబోయిన్‌పల్లి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

**బీసీ బిల్లు ఆమోదంపై..**

నాగర్‌కర్నూల్ టౌన్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో ఆమోదం తెలపడంతో హర్షం వ్యక్తం చేస్తూ జాతీయ బీసీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సంద ర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో నాయకులు నేష లక్ష్మయ్య, సదుర్ల తిరు పతయ్య, సుధాకర్‌గౌడ్, చైతన్య, శివ, నవీన్, శ్రీనివాసులు, నిరంజన్‌యాదవ్, పబ్బతి శ్రీనివా సులు, గంగోజీ పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై..**

వంగూరు : రాష్ట ప్రభుత్వం ఎస్సీవర్గీకరణ బిల్లు ఆమోదించడాన్ని హర్షిస్తూ గురువారం సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీవర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంపై సీఎంకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రయ్య వేమారెడ్డి, చందు, మురళీ, భాస్కర్‌రెడ్డి, శేఖర్, రామకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

## సమాజంలో దివ్యాంగులను గౌరవించాలి

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య సలహాదారుడు శ్రీరామ్ ఆర్య**



మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చీఫ్ అడ్వయిజర్ శ్రీరామ్ ఆర్య

తిమ్మాజిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ వ్యక్తి సమాజంలో దివ్యాంగులతో ప్రేమగా ఉండి అన్ని రకాలుగా సహాయం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య సలహాదారు శ్రీరామ్‌ఆర్య అన్నారు. హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో గురువారం తిమ్మాజిపేట మండలం కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. చెవిటి, మూగ మానసిక అంగ దివ్యాంగ విద్యార్థులకు అవసరమయ్యే చట్టాలపై అవగాహన కల్పించారు. ఇతర వ్యక్తులతో సమానంగా రక్షణ ఉంటుందని ఓటు హక్కు ఉందని సమస్యలు పరిష్కరించడం కోవడం కోసం సలహాలు, సూచనలు పొందడానికి టోల్ ఫ్రీ నెంబరు 15100కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందాలని వికలాంగులకు సూచించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణశెట్టి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో తాగునీటి సౌకర్యం కల్పించాలి

**- తెలకపల్లి బస్టాండ్‌ను పరిశీలించిన అచ్చంపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ పీఎస్ దేవి**





తెలకపల్లి బస్టాండ్‌ను పరిశీలిస్తున్న అచ్చంపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ పీఎస్.దేవి

తెలకపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బస్టాండ్‌లో తాగునీటి వసతి కల్పించడానికి దాతలు ముందుకు రావాలని ఆర్టీసీ అచ్చంపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ పీఎస్.దేవి కోరారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి దాతలు ముందుకు రావాలని ఆమెవిజ్ఞప్తి చేశారు. గురువారం తెలకపల్లి బస్టాండ్‌ను ఆమె పరిశీలించారు. ఈ విషయంలో డిపో మేనేజర్‌తో మాట్లాడి తగిన చర్యలు చేపడుతామన్నారు. బస్టాండ్ లో మరో కంట్రోలర్‌ను నియమించేందుకు డీఎంతో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో బస్టాండ్ కంట్రోలర్ ఏ.వెంకటేశ్, జి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్లకు వాహన చట్టాలపై అవగాహన



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

ఉప్పునుంతల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని దుందుభీ వాగు పరిసర ప్రాంతాలైన పెద్దాపూర్, మొల్గర గ్రామాలలో ఇసుక క్వారీ వద్ద బుధవారం ట్రాక్టర్ డ్రైవర్లకు వాహన చట్టాలపై ఎస్ఐ వెంకట్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, లైసెన్స్ లేకుండా, అనుమతులు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వాహన డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

### తోటి ఫొటోగ్రాఫర్‌కు చేయూత

బల్మూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోదల్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఫొటోగ్రాఫర్ అంజికి అచ్చంపేట తాలూకా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందించనట్లు ఆ యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట తాలూకా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు తాటి కొండగిరి, ప్రధాన కార్యదర్శి బాలరాం, కోశాధికారి సలేశ్వరం, ప్రచార కార్యదర్శి పిల్లి బాలరాజు, సభ్యులు పాల్గొన్నారు.

### విద్యార్థికి అభినందనలు

ఉప్పునుంతల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఉప్పునుంతలకు చెందిన పాపిశెట్టి మధుసూదన్ కల్పన కుమారుడు సుప్రీత్ స్థానిక మైల్‌స్టోన్ ప్రైవేట్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు సుప్రీత్ సోలార్ ద్వారా సైకిల్ ప్రయాణం ఎలా చేయలో ప్రయోగాత్మకంగా చేసి ఔరా అనిపించాడు. రాణి ఇందిరాదేవి అలూమ్ని వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కటికెనేని సాయి ప్రసాద్‌రావు ఆదేశాల మేరకు సొసైటీ మెంబరు బండి వెంకట్‌రెడ్డి గురువారం మండల కేంద్రంలోని పాఠశాలలో విద్యార్థికి రూ.1000 నగదు బహుమతి అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అనంతరెడ్డి, చంద్రమౌళి, ప్రిన్సిపాల్ ఉన్ని కృష్ణన్, ఉపాధ్యాయులు నిరంజన్ ఉన్నారు.

### మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే..

కందనూలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మందకృష్ణ మాదిగ రాజీలేని పోరాటం చేయడంతోనే తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదింప చేసిందని కొంగరి ప్రవీణ్‌కుమార్ విజయోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. వర్గీకరణకు మద్దతు తెలిపి బిల్లు పాస్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సహచర బృందానికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, సంఘం నాయకులు గంగనమోని వెంకటయ్య, బండి నరసింహ, బండి చెన్నయ్య, సుబ్బారావు, కృష్ణయ్య, రంగ ఉన్నారు.

## పెట్రోల్‌లో కల్తీ

**- పోలీస్ స్టేషన్‌లో బాధితుని ఫిర్యాదు**

**- విచారణ చేపట్టిన అధికారులు**



నీళ్లు కలిపిన కల్తీ పెట్రోల్‌ను చూపిస్తున్న వాహనదారుడు పర్వత్‌రెడ్డి

వెల్దండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పవనపుత్ర ఫిల్లింగ్ స్టేషన్ హెచ్‌పీ పెట్రోల్ పంపులో కల్తీ పెట్రోల్ విక్రయం కలకలం రేపింది. ఓ వాహనదారుడు పోయించుకున్న పెట్రోల్‌లో నీళ్లు రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన మల్లేపల్లి పర్వత్‌రెడ్డి బుధవారం రాత్రి తన ద్విచక్రవాహనంలో స్థానికంగా ఉన్న పవనపుత్ర ఫిల్లింగ్ స్టేషన్‌లో 200 రూపాయల పెట్రోల్ పోయించుకున్నాడు. కొంత దూరం వెళ్లగానే వాహనం ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాకపోవడంతో వాహనాన్ని అక్కడే ఉంచి ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం వాహనాన్ని మెకానిక్‌కు చూయించడంతో అనుమానించిన మెకానిక్ పెట్రోల్ బయటకు తీయగా నీళ్లతో కూడిన పెట్రోల్ వచ్చింది. దీంతో పర్వత్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేశాడు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో జిల్లా కేంద్రం నుండి సివిల్ సప్లై ఏఎస్‌వో హైదర్‌అలీ, డీటీ దీపికలు పెట్రోల్‌పంపు వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. పెట్రోల్ నమూనాలను నాణ్యతా ప్రమాణాల శాఖకు పంపనున్నట్లు ఏఎస్‌వో తెలిపారు. కాగా గతంలో కూడా ఈ పెట్రోల్ పంపుపై పలుమార్లు కల్తీ ఆరోపణలు వచ్చాయి.

### నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

తిమ్మాజిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు దానం బాలరాజు అన్నారు. కేంద్రంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాకు మద్యం సరఫరా చేసే డిపోలో హమాలీలుగా పని చేసేందుకు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. అందుకు తమ వంతుగా ఎవరితో విబేధించకుండా అందరితో కలిసిపోతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇటీవల నిరుద్యోగ సమస్యపై నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల వారీగా నిరుద్యోగులను గుర్తిస్తూ సమానంగా న్యాయం జరిగేలా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలను కోరడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముబారక్, రవీందర్‌రెడ్డి, ఖాజామైనొద్దీన్, సందీప్, కృష్ణ పాల్గొన్నారు.

### ఏర్పాట్లు పూర్తి

ఉప్పునుంతల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఉప్పునుంతల, కంసానిపల్లి, వెల్టూరు, పెనిమిళ్ల, ఉప్పునుంతల కేజీబీవీ, వెల్టూరులోని ఎంజేపీటీబీసీ బాలికల పాఠశాలలో 238 మంది విద్యార్థులు పరీక్షకు హాజవుతున్నట్లు ఆయన తెలిపారు. వీరిలో బాలికలు 159 మంది, బాలురు 79 మంది విద్యార్థులు ఉన్నట్లు ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలి

**- ఉమామహేశ్వరంలో మృత్యుంజయ హోమం చేసిన పాలకవర్గం**



హోమం చేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు బీరం మాధవరెడ్డి, నాయకులు

అచ్చంపేటటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని శ్రీశైలం ఉత్తర ముఖ ద్వారమైన ఉమామహేశ్వర ఆలయంలో ఆలయ అధ్యక్షుడు బీరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మృత్యుంజయ హోమం అర్చకులు వీరయ్య శాస్త్రీ జరిపించారు. మాధవరెడ్డి దంపతులతో పాటు ఆలయ పాలక మండలి సభ్యులు, కౌన్సిలర్లు సునీత రెడ్డి, గౌరీశంకర్, నాయకులు చత్రునాయక్, రామనాథం, లక్ష్మణ్, అంజనేయులు, రవితో పాటు నాయకులు పెద్దఎత్తున మృత్యుంజయ హోమంలో పాల్గొన్నారు. అనంతరం ఈశ్వరునికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

**నా ఆరోగ్యం నిలకడగా ఉంది : ఎమ్మెల్యే**

నా ఆరోగ్యం నిలకడగా ఉంది. ఎవరూ ఆందోళన చెందొద్దు అని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వీడియా ద్వారా ఆయన మాట్లాడారు. 'దేవుడి దయ, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో నేను బాగున్నాను' అని అన్నారు. త్వరలో నేను మీ ముందుకు వస్తానన్నారు. నా కోసం హైదరాబాద్‌కు వచ్చే కార్యక్రమాలు ఎవరూ పెట్టుకోవద్దని నాయకులకు సూచించారు.

## విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**- ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి - డిగ్రీ కళాశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం**



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్/ తెలకపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంటుతోపాటు, కళాశాల ఆవరణలో బొటానికల్ గార్డెన్‌ను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి కేంద్రీకరించాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళవాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, ముజీబ్, శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెలకపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నీటి శుద్ధీకరణ యంత్రాన్ని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ప్రారంభించారు. సీడీఎఫ్ సహకారంతో నాలుగు లక్షలతో ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీఎఫ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ నరేష్, డీఎస్‌వో రాజశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ ఎం.యాదయ్య, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, మాజీ సర్పంచ్ బాలగౌడ్, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్యగౌడ్, పీఆర్‌టీయూ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ**



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ

కందనూలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాలనరసింహ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్నా నేటికీ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా మాటలతో కాలం గడుపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రం కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇళ్లు అని, జనవరి 26వరకు రైతు రుణమాఫీ, రెండులక్షల వరకు అని రైతు భరోసా ఏదీ సక్రమంగా అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన పద్దులు, ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులు ఎలా ఖర్చు చేస్తారు, దళితుల రుణాలు ఎలా చెల్లిస్తారు, దళితవా డల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతారో పద్దుల వారీగా డబ్బులు కేటాయించాలని ఆ యన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.కేశవులు గౌడ్, ఎస్ఎండీ.ఫయాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నరసింహ, ఈర్ల చంద్రమౌళి, కొమ్ము భరత్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు పోరాడుతాం

**- రిలే నిరాహార దీక్షలో సీపీఎం నాయకులు**



పెంట్లవెల్లిలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

పెంట్లవెల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెంట్లవెల్లిలో ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాలుగవ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతు న్నాయి. ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం మాంకాలమ్మ మిట్టలో ఇళ్ల స్థలాల కోసమని 13 ఎకరాల 39 గుంటల భూమిని నిరుపేదల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు కూడా నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం చొరవ చూపి ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్య క్రమంలో సీపీఎం నాయకులు హనుమంతు, వెంకటమ్మ, తిమ్మస్వామి, వెంకటస్వామి, శ్రీనివాసు, చిట్టెమ్మ, బాలస్వామి పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ



రైటింగ్ ప్యాడ్లు పొందిన విద్యార్థులతో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

మన్ననూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మన్ననూరు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 80 మంది పదో తరగతి విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను గురువారం పంపిణీ చేశారు. క్లాస్‌మేట్ క్లబ్ మండల అధ్యక్షుడు కామిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ శుక్రవారం పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు భయం వీడి ధైర్యంగా పరీక్షలకు వెళ్లాలని సూచించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో మండల వ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5వేలు ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.3 వేలు, గ్రేడ్ల వారీగా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. అందరూ ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర పాలకమండలి సభ్యురాలు సంభు శోభ, ఆర్యవైశ్య మహాసభ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సంభు వెంకట్‌రమణ, ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ రూపాదేవి, కాంగ్రెస్ నాయకులు బుచ్చయ్య, రాజారాం పాల్గొన్నారు.